

# అమెరి'కా'లేజ్

## - లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయీ, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయీ... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ - ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*- సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**కేంపసులో** ఫోటోలు తీస్తుండగా హనీషకి ఎంతోమంది కాంప్లిమెంట్స్ ఇచ్చారు. నిజానికి తను జీన్స్ ప్యాంట్ కన్నా లంగా వోణీలో ఎంతో అందంగా ఉంది. మేము ఇంటికి వెళ్ళేసరికి అందరూ ఇళ్ళ బయట కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. ఇది అమెరికాలాగా లేనే లేదు.

"నువ్వు క్లాసెస్‌లో ఎన్రోల్ అయ్యావా?" హనీష అడిగింది.

"ఇంకా లేదు" బదులిచ్చాను.

"మీ ప్రొఫెసర్ ఏమైనా చెప్పారా?"

"ఇంకా లేదు"

"ఈసారి కలిసినప్పుడు అడుగు."

"సరే."

కాస్త నిశ్శబ్దం తరువాత, "ఇక్కడ ఎలా ఉంది నీకు?" అడిగింది.

"జెట్‌లాగ్ అంతా సెట్ అయిపోయిందా?"

"యా"

"నీకు సైకిల్ తొక్కడం వచ్చా?"

"కేంపస్‌లో తిరగడానికి సైకిల్ కొనుక్కోవచ్చు నువ్వు. అయితే జాబ్ వచ్చింది కాబట్టి ఈజీ"

"గుడ్ ఐడియా"

"వాల్‌మార్ట్‌లో దొరుకుతాయి."

"సరే."

"నువ్వు వంట ఎప్పుడు నేర్చుకున్నావు?"

"ఇంటర్ తరువాత. ఎంసెట్ హాలీడేస్‌లో"

"నీ వంట నాకు నచ్చింది. కొన్ని రెసిపీస్ నేర్పించు నువ్వు ఇల్లు చూసుకునేలోపు"

"యా నేర్పిస్తాను. ఎవరి దగ్గరైనా అకామిడేషన్ ఉందేమో తెలిసిందా?"

"లేదు. ఇంకా తెలియలేదు. నువ్వు డార్మ్స్ లో ఉంటే బెటర్. కలిసి ఉంటే కాన్సన్‌ట్రేషన్ దెబ్బ తింటుంది."

"ఎందుకు?"

"చూస్తున్నావుగా, సాయంత్రాలు అందరూ కలిసి మాట్లాడుకుంటారు. రూమ్మేట్ గొడవలు వస్తూనే ఉంటాయి. గట్టిగా మాట్లాడుకుంటారు. కలిసి వంట చేసుకోవాలి. కబుర్లకే కాలం సరిపోతుంది. నువ్వు ఏరోస్పేస్ కాబట్టి చాలా కష్టపడి చదవాలి. దాని పైన థీసిస్ కూడా చెయ్యాలంటే డిస్ట్రాక్షన్స్ ఉండకూడదు."

తలూపుతూ అన్నయ్యకి మెసేజ్ చేసాను.

"రేపు డార్మ్స్ కి వెళ్దాం. నాకు తెలిసిన ఒకమ్మాయి ఉంటుంది. చూడు ముందు. నచ్చితే అప్పుడు ఆలోచించొచ్చు" అంది.

"సరే."

అన్నయ్య డార్మ్ లో రెంట్ ఎంతో కనుక్కోమని రిప్లై ఇచ్చాడు.

దానికి హనీష "నాకు సరిగ్గా తెలీదు. రేపు ఆ అమ్మాయిని అడుగుదాం" అంది.

ఈలోగా నాకు ఆకలి మొదలైంది. మిగిలిపోయిన అన్నంతో పులిహోర చేద్దామని హనీషకి చెప్పాను. తలూపింది.

"నువ్వు ఇక్కడే ఉండు నేను చేస్తానులే. ఎక్కువ టైం పట్టదు" అంటూ కిచెన్‌లోకి వెళ్ళాను. ఎందుకో ఒక్కసారిగా దిగులు మొదలైంది. అతి వేగంగా పులిహోర చేసి హనీషకి కొంత, నాకు కొంత ప్లేట్లలో పెట్టి బయటకి తీసుకెళ్ళాను.

ఒక స్పూన్ రుచి చూసి "పులిహోర నాకు చాలా ఇష్టం. చిన్నప్పుడు మా అమ్మ పులిహోర, దద్దోజనం నైవేద్యానికి వండేది" అంది.

"గుళ్ళో కూడా ఎక్కువ పులిహోర, దద్దోజనం ప్రసాదంగా పెడతారు"

"చెయ్యడానికి ఈజీ అనేమో?"

"శాస్త్రాలలో ఏదో ఉండే ఉంటుంది. రాముడికి వడపప్పు, పానకం లాగా మిగిలిన దేవుళ్ళకి పులిహోరా, దద్దోజనమేమో."

"నీకు దైవ భక్తి ఎక్కువ కదా? " అడిగింది.

"ఔను. ఇంట్లో ఉన్నప్పుడు రోజూ గుడికెళ్ళేదాన్ని."

"నేను ఎప్పుడో ఒకసారి క్లాసు బంక్ కొట్టి చిలుకూరికి వెళ్ళేదాన్ని. అంతే"

ఇంతలో కొంతమంది కారెక్కి రౌండ్లు కొట్టడం ప్రారంభించారు.

"నీకు డ్రైవింగ్ వచ్చా?" అడిగింది.

"రాదు"

"ఇండియాలో ఎప్పుడూ డ్రైవ్ చెయ్యలేదా?"

"లేదు."

"అయితే ఇక్కడ డ్రైవింగ్ ఈజీగా వచ్చేస్తుంది. కన్ఫ్యూజన్ ఉండదు. నాకు స్టార్టింగ్‌లో ఇబ్బంది కలిగింది."

"ఓ, ఓకే"

కాస్త నిశ్శబ్దం తరవాత "బోర్ కొట్టిస్తున్నానా?" అడిగింది.

"లేదు. బోరు కొట్టట్లేదు."

"డల్‌గా ఉన్నావేంటి?"

"ఎందుకో కాస్త దిగులుగా ఉంది."

"ఇంట్లో వాళ్ళు గుర్తొస్తున్నారా?"

నిజానికి కారణం అదికాకపోయినా "ఔను" అన్నాను. ఇల్లు, థీసిస్, క్లాసుల్లో ఎన్రోల్ అవ్వడం, కొత్త రూమ్మేట్స్‌తో అడ్జస్ట్ అవ్వడం లాంటివన్నీ కలిపి ఈ దిగులు భయం కలుగుతుంది. అన్నయ్య ఈ ఊళ్ళో ఉంటే ఎంత బావుండేదో.

"నువ్వు మీ అన్నయ్య దగ్గర కాకుండా పర్డ్యూలో ఎందుకు చేరావు? కొలరాడో బౌల్డర్ కూడా మంచి యూనివర్సిటీ కదా?"

"ఇక్కడ నీల్ ఆమ్ స్ట్రాంగ్ చదివారని వచ్చాను."

చిన్నగా నవ్వుతూ ఆశ్చర్యపోయింది.

"నీకు బుక్స్ ఎప్పటినుంచి అలవాటు? నేను ఎన్నో సార్లు ట్రై చేసాను కానీ నావల్లకాలేదు"

"నిజానికి నేను మా అన్నయ్య ఇంట్లో ఉన్నప్పుడు అలవాటు చేసుకున్నాను. అంతకు ముందర చదివేదాన్ని కాదు."

"నిజమా?" ఆశ్చర్యపోయింది.

తలూపాను.

ఇంతలో కొంతమంది వచ్చి "హే, మేము డ్రైవ్‌కి వెళ్దామనుకుంటున్నాము మీరు కూడా వస్తారా?" అడిగారు.

"ఎక్కడికి?" హనీష అడిగింది.

"ఉత్త చిన్న డ్రైవ్‌కి వెళ్ళి ఐస్‌క్రీం రిటంట్లో అనుకుంటున్నాము" అన్నారు.

"మా ఇద్దరికి ప్లేస్ ఉందా?"

"యా.యా. త్రీ కార్స్‌లో వెళ్తున్నాము."

"వస్తావా?" నన్ను అడిగింది.

"లేదు. నాకు నిద్రొస్తుంది. నువ్వు వెళ్ళు."

"పక్కానా? ఇక్కడ ఐస్క్రీం ఇండియాలో లాగా ఉండదు."

"యా, పక్కా. నెక్స్ట్ టైం వస్తాను."

"సరే. అయితే నేను వెళ్ళి వస్తాను" అంటూ రెండడుగులు ముందుకి వేసి వెనక్కి తిరిగి "పక్కానా? డ్రైవ్ రిలాక్సింగ్‌గా ఉంటుంది" అంది.

"లేదు కొద్దిసేపు అన్నయ్యతో మాట్లాడి పడుకుంటాను."

తలూపి "జాగ్రత్త" అని వెళ్ళిపోయింది. బయట చీకటి పడుతుండగా నేను లోపలికి వెళ్ళాను. అన్నయ్యతో మాట్లాడాలనిపించలేదు. ప్రొఫెసర్ ఇచ్చిన టెక్స్ట్ బుక్ ఒకటి తెరిచి, లేప్ టాప్ లో గూగుల్ సెర్చ్ తెరిచి పెట్టాను. ఒక పుస్తకం, పెన్ తీసుకుని అర్థం చేసుకునే ప్రయత్నం చేసాను. ఎంతసేపు చదివానో తెలీదుకానీ, మొదటి చాప్టర్ సగం అయ్యేసరికి హనీష వచ్చింది. దాదాపు యాభై పేజీలు చదివాను. గూగుల్ సెర్చ్ వల్ల తెలీనివి నేర్చుకున్నాను. నొట్‌బుక్‌లో అన్నీ రాసుకున్నాను. మనసు తేలికైంది. దిగులు తగ్గింది. వెంటనే ఉత్సాహం కలిగింది.

"సినిమా చూద్దామా?" హనీషని అడిగాను.

"నిద్రపోతున్నావనుకున్నా. యా చూద్దాం" అంటూ తన కంప్యూటర్ తెరిచింది.

"ఏది చూద్దాం?"

"నీ ఇష్టం"

నా చదువు గోలకి సరిపోయేలా "హై హై  నాయక చూసావా?" అడిగాను.

"లేదు.ఎవరు అందులో?"

"నరేష్. అందులో స్కూల్ టీచర్. ఫన్నీగా ఉంటుంది."

ఇప్పటి సినిమాల్లో 'బీప్' కన్నా ఆ సినిమాలో 'బూతు బూతు' బావుందని ఇద్దరం అనుకున్నాము. నరేష్ ఆ పిల్లాడిని మార్చే దగ్గర పాజ్ చేసి తిరిగి రేపు పూర్తి చేద్దామని నిశ్చయించుకున్నాము. పీడ కలలు రాకూడదని దేవుణ్ణి ప్రార్థించి నిద్రలోకి జారుకున్నాను.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story